క్లుప్తంగా

మార్కెట్ చైర్‌పర్సన్‌కు సన్మానం



చైర్‌పర్సన్ జ్యోతి దంపతులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: ఉమ్మడి పాలమూరు జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జ్యోతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు జగన్, ప్రభాకర్ రెడ్డి, డీసీసీ సభ్యులు భగవాన్‌రెడ్డి చైర్‌పర్సన్ జ్యోతి దంపతులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అంబాజీ, రవి, కృష్ణ, ఆరీఫ్ ఉన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి



కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

తుర్కయంజాల్: బహుజన వర్గాలు అధికారంలో ఉంటేనే పేదల జీవితాల్లో మార్పు సాధ్యం అవుతుందని విశ్వసించిన నేత కాన్షీరామ్ అని బీఎస్పీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు కుమార్, కోశాధికారి రమేష్‌లు అన్నారు. బుధవారం కాన్షీరామ్ 18వ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు బాబు, రమణ, సైదులు, రాజు, రఘు, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టు

ఇబ్రహీంపట్నం: ఫార్మా కంపెనీని రద్దు చేయాలని రైతులు బుధవారం చేపట్టిన మహా పాదయాత్రకు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు మద్దతుగా వెళ్తున్నారనే సమాచారంతో పట్నం పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేశారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా బయల్దేరేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు బాలస్వామి, శివ, గణేశ్‌నాయక్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా పత్యానాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందని ఆరోపించారు.

విద్యార్థినికి అభినందనలు



నవ్యను అభినందిస్తున్న వెంకటేశ్ తదితరులు

తలకొండపల్లి: మండల పరిధి వెంకట్రావ్‌పేట్‌కు చెందిన సప్పిడి నవ్య.. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్ ర్యాంక్ సాధించి, ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు పొందారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ విద్యార్థిని హైదరాబాద్‌లో మంగళవారం కలిసి అభినందించారు. వైద్య విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హైమావతి, రమేష్, రాజు, కిషన్, హుస్సేన్ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన పీఆర్టీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: డీఎస్సీ 2024 ఉద్యోగ నియామక పత్రాలు అందుకోబోతున్న 48 మంది కొత్త టీచర్లకు పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పరమేశ్ బుధవారం సన్మానించి, పెన్నులు బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ పోటీ పరీక్షలో రాణించి, భావితరాలను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయ వృత్తిలోకి వస్తున్న సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నియామకాల పత్రాలను అందుకోబోతున్న వారిని ఆర్టీసీ బస్సులో ఎల్బీ స్టేడియానికి తహసీల్దార్ సునీత, స్పెలాఫీసర్ నవీన్‌రెడ్డి అభినందనలు తెలుపుతూ సాగనంపారు.



కడ్తాల్: మైసిగండిలో సరస్వతిగా అన్నపూర్ణేశ్వరి



ఆమనగల్లు: సరస్వతిదేవిగా దుర్గామాత



ఇబ్రహీంపట్నం: చదువులతల్లిగా.. రాజరాజేశ్వరి

సరస్వతీ నమస్తుభ్యం

- కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రోత్సవాలు
- చదువుల తల్లిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి
- ప్రత్యేక పూజలు చేసిన భక్తజనం
- చిన్నారులకు అక్షరాభ్యాసం

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం/కడ్తాల్/యాచారం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజైన బుధవారం ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహా సరస్వతిదేవి అలంకారంలో దుర్గామాత, భక్త మార్కండేయస్వామి దేవాలయంలో సరస్వతిగా రాజరాజేశ్వరిదేవి, కడ్తాల్ మైసిగండి, శివరామాలయంలో చదువు తల్లిగా అన్నపూర్ణేశ్వరి, ఇబ్రహీంపట్నం ఈశ్వరాంజనేయ ఆలయంలో సరస్వతిగా రాజరాజేశ్వరి దేవి, యాచారం నందివనపర్తిలో జ్ఞాన సరస్వతిగా సరస్వతి మాత భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆమనగల్లు కన్యకాపరమేశ్వరి సన్నిధిలో భక్తులు హోమం, అమ్మవారికి ఒడిబియ్యం పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కండేయస్వామి సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పరమేశ్వరీ ఆలయ కమిటీ చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్, కార్యదర్శి నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు రంగయ్య, పాండయ్య, లక్ష్మీనారాయణ, ప్రమోద్, రవి, బొజ్జ నర్సింహ, పరమేశ్వరీ పూజా కార్యక్రమాల్లో నాయకులు ఎంగలి బాలకృష్ణ, అప్పం శ్రీను, ఎంగలి రమేశ్, రాఘవ, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

నవరాత్రుల్లో భాగంగా పట్నంలో ఏర్పాటు చేసిన మండపాలను మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ సందర్శించి, అమ్మవార్లకు పూజలు చేశారు. బృందావన్ కాలనీలో వీర శివాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్, అయ్యప్ప స్వామి దేవాలయాల్లో కొలువైన దుర్గమ్మకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు బోసుపల్లి ప్రతాప్, ముత్యాల భాస్కర్‌లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

మైసిగండిలో..

కడ్తాల్ మండల పరిధి మైసిగండి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శివరామాలయంలో కొలువైన అన్నపూర్ణేశ్వరి మాతా, సరస్వతీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. నవరాత్రులను పురస్కరించుకుని పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కలశ, విశేష పూజలు, యజ్ఞం, చండి హోమం, అర్చనలు ఘనంగా నిర్వహించారు.

నందివనపర్తిలో..

యాచారం మండల పరిధి నందివనపర్తి గ్రామంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారు.. నిజరూప దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చండీ ఉపాసకులు రేవల్లె రాజు శర్మ పర్యవేక్షణలో సరస్వతి హోమం, సహిత చండి హోమం, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. గతేడాది నవరాత్రుల నుంచి అమ్మవారికి విశిష్ట పర్వదినాలలో అమ్మవారికి అలంకరించిన చీరల వేలం, పూర్ణాహుతి, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మాతృమండలి సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారికి పల్లకీ సేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఫౌండర్ సదా వెంకట్, ఉత్సవ మండలి సభ్యులు జలందర్, రాఘవేంద్ర శర్మ, వెంకట్ రెడ్డి, శివ కుమార్, నిఖిల్, సంతోష్ కుమార్, రామనాథం, గణేశ్, సలహా మండలి సభ్యులు శేఖర్ రెడ్డి, అంజయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, మాతృమండలి సభ్యులు అనురాధ, ఉదయ శ్రీ, రుద్రమ్మ, దీపిక రాణి పాల్గొన్నారు.



యాచారం: అమ్మవారి నిజరూప దర్శనం



ఆమనగల్లు: ఆర్యవైశ్యసంఘం హోమం



ఇబ్రహీంపట్నం: అమ్మవారి సన్నిధిలో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల



యాచారం: జ్ఞానసరస్వతి ఆలయంలో హోమం



ఆమనగల్లు: మార్కండేయ దేవాలయంలో..



పెద్దఅంబర్‌పేట: వీర శివాజీ యూత్ అసోసియేషన్ మండపంలో భక్తులు

ప్రజాసేవే లక్ష్యంగా..

- ప్రత్యక్ష రాజకీయాలపై బిలకంటి ఆసక్తి
- కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులతో స్థానిక ఎన్నికల బరిలో దిగేందుకు ఏర్పాట్లు
- ప్రజాదరణ కలిగిన వ్యక్తిగా చంద్రశేఖర్‌రెడ్డికి గుర్తింపు



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో చంద్రశేఖర్‌రెడ్డి

యాచారం: ప్రజాసేవలో తరించాలన్న తపనతో ఆయన తన ఉపాధ్యాయ వృత్తిని వీడారు. అనంతరం పరోక్షంగా రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో సేదతీరుతున్నారు. తండ్రి పేరిట ట్రస్టును ఏర్పాటు చేసి, మండల ప్రజలకు తనవంతు సాయం చేస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారంలోనూ రాణిస్తూ.. పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ప్రస్తుతం ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. అందుకు రాజకీయ అరంగేట్రమే సరైందని నిర్ణయించుకున్నారు. రాజకీయ ప్రముఖుల అండదండలతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు.. బీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి.

పేద విద్యార్థులకు అండగా..

యాచారం మండలం నందివనపర్తి గ్రామంలోని రైతు కుటుంబానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి.. ఓ ఉపాధ్యాయుడిగానే కాకుండా.. సేవాసంస్థ బీఎస్ఆర్ అధినేతగా ప్రజలకు సుపరిచితుడు. రాజకీయాలపై ఆసక్తితో ఉన్న ఆయన.. బీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్నారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, పేద విద్యార్థులకు ఆర్టీసీ బసు పాసులు ఇప్పిస్తున్నారు. ఉన్నత చదవుల కోసం రూ.లక్షల్లో ఆర్థిక సాయం చేస్తున్నారు. పేదల కుటుంబీకుల్లో ఎవరైనా చనిపోతే ఆర్థిక సహాయం చేసి అండగా నిలుస్తున్నారు. ఇబ్రహీంపట్నం, కందుకూరు, మంచాల మండలాలతో పాటు తుర్కయంజాల్, ఆదిబట్ల మున్సిపాలిటీ ప్రజలకు ఆర్థిక సేవలు అందిస్తున్నారు. నందివనపర్తి శ్రీ జ్ఞాన సరస్వతి, ఆంజనేయస్వామి దేవాలయం, ఓంకారేశ్వరాలయం, శివలయాల నిర్మాణాలకు రూ.లక్షల్లో విరాళం ఇచ్చారు.

అవకాశం కలిసొస్తే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో దగ్గరి పరిచయాలు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అండదండలు, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి ఆశీస్సులతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు చంద్రశేఖర్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. అవకాశం కలిసొస్తే మండలం నుంచి జెడ్పీటీసీ, ఎంపీపీ, జనరల్ అయితే ఏదో ఒక గ్రామం నుంచి ఎంపీటీసీగా పోటీ చేయడానికి ప్రణాళికలు రూపొందించుకున్నారు. అవసరమైతే.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి రెడీ అంటున్నారు. ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందిన బిలకంటి.. ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయడానికి రాజకీయాల్లో వస్తే ప్రజానికానికి మరింత మంచి జరుగుతుందని, ఆయన మండలం నుంచి ఏ పదవికి పోటీలో నిలిచినా.. గెలుపు తథ్యమని మండల ప్రజలు స్పష్టంచేస్తున్నారు.

ఘనంగా పుష్పోత్సవం



ఆమనగల్లు: కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళా న్యాయవాదులు తదితరులు



ఇబ్రహీంపట్నం: బతుకమ్మతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబురాలు
- ఆడిపాడిన మహిళా న్యాయవాదులు

ఆమనగల్లు: బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బుధవారం జ్యుడీషియల్ కోర్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను కోర్టు ఆవరణలో ప్రతిష్ఠించి మహిళా న్యాయవాదులు, ఉద్యోగులు ఆడిపాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, సీనియర్ న్యాయవాది యాదీలాల్, కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ, కోర్టు జిల్లా ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్, న్యాయవాదులు రామకృష్ణ, శేఖర్, విజయ్, సంతోష్, గణేశ్, మల్లేశ్, కృష్ణ, బిక్యానాయక్, దేవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూర్‌లో..

తుర్కయంజాల్: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా నిలుస్తుందని చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో జరిగిన బతుకమ్మ సంబురాల్లో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఆడిపాడారు. అనంతరం సిబ్బందికి దుస్తులు, సబ్బులు, నూనె పంపిణీ చేశారు. వారితో కలిసి ఆమె భోజనం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మంగమ్మ, ఐలయ్య, రవీందర్ రెడ్డి, ఉదయశ్రీ, మాధవి, హరిత పాల్గొన్నారు.



తుర్కయంజాల్: బతుకమ్మ ఆడుతున్న చైర్ పర్సన్ అనురాధ తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ సంపత్‌కుమార్

ఆమనగల్లు: ఉచిత డయాబెటిస్ పరీక్షల వైద్య శిబిరం విజయవంతమైంది. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి లయన్స్‌భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించగా.. ల్యాబ్ టెక్నీషియన్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురికి మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సమావేశం గురువారం సాయంత్రం 5 గంటలకు కల్వకుర్తి లయన్స్‌భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పీఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల గురించి చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి

ఆర్డీఓ అనంతరెడ్డికి సీపీఎం నేతల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలో సర్వే నంబర్ 212/1లో ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జాకోరుల నుంచి రక్షించాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు యాదయ్య మాట్లాడుతూ.. 15 సంవత్సరాల క్రితం సీపీఎం పోరాట ఫలితంగా 212 సర్వేలో రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం శ్మశాన వాటికకు కేటాయించిందని తెలిపారు. ఆ భూమికి రక్షణగా చుట్టూ ప్రహరీ లేదని పేర్కొన్నారు. దీంతో రియల్టర్లు, స్వార్థ రాజకీయ నాయకులు కొందరు ఎకరానికి పైగా భూమిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. భూమిని రీసర్వే చేయించి, కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కిషన్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మ, సత్యనారాయణ, భాస్కర్, కృష్ణ, ఆశీర్వాదం, పొట్టి శ్రీనివాస్, పరమేశ్‌లున్నారు.

ఫార్మాసిటీని రద్దు చేసి..



బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తంచేస్తున్న భూ బాధిత మహిళలు, రైతులు

- మా భూములు మాకు ఇప్పించండి
- బతుకమ్మ ఆడి భూ బాధితుల నిరసన

యాచారం: ఫార్మాసిటీని రద్దు చేసి, భూసేకరణలో టీజీఐఐసీ పేరిట మార్చిన తమ పట్టా భూముల రికార్డులను తమ పేరిట మార్చాలని భూ బాధితులు డిమాండ్ చేశారు. బుధవారం నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ గ్రామాల మధ్య నిర్మించిన ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి స్తూపం వద్ద నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద భూ బాధితులు ఫార్మాసిటీ పేరిట సేకరించిన పొలాల్లో బతుకమ్మ ఆడారు. 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. ఫార్మాసిటీని రద్దు చేసేలా చూడు తల్లి ఉయ్యాలో.. ఫార్మాసిటీని రద్దు చేసి ఉయ్యాలో.. టీజీఐఐసీ పేరు మీదున్న మా పట్టా భూములు ఉయ్యాలో.. రైతుల పేరిట మార్చేలా చూడు తల్లి ఉయ్యాలో' అంటూ పాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు. తాజాగా ఇచ్చిన హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి, రైతుల పేరిట భూ రికార్డులు మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు లేఖలు పంపేందుకు సంతకాలు సేకరించారు.



సంతకాలు సేకరిస్తున్న రైతులు

గుంతల పూడ్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్: ఇటీవల కురిసిన వర్షాలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ పెద్ద కాలువ వంతెనపై గుంతలు ఏర్పడి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు అల్లి భానుయాదవ్ సొంత ఖర్చుతో మట్టి పోయించి, గుంతలను పూడ్చివేయించారు. దీంతో వాహనదారులు, గ్రామస్తులు యువకుడిని అభినందించారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ

పహాడీషరీఫ్: బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సుధాకర్ గతంలో పహాడీషరీఫ్, బాలాపూర్ ఠాణాలో ఎస్ఐగా పనిచేశారు. 2016లో పోలీస్ స్టేషన్ల పునర్విభజనలో పహాడీషరీఫ్ నుంచి నూతనంగా ఏర్పడిన బాలాపూర్ ఠాణాలో కొంతకాలం ఎస్ఐ ర్యాంక్‌తో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యమని, ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.